నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I హైదరాబాద్, సోమవారం 1 జూలై 2024 SANGAREDDY




సిద్దిపేట జిల్లాలోని మోయతుమ్మెద వాగులో నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు

# ఇసుక అక్రమ దందా..



ఇసుక తవ్వకాలతో వట్టిపోతున్న సిద్దిపేట జిల్లాలోని మోయతుమ్మెద వాగు

- వట్టిపోతున్న సిద్దిపేట జిల్లాలోని 'మోయతుమ్మెద' వాగు
- బహిరంగంగా ఇసుక డంపుల నిర్వహణ
- చోద్యం చూస్తున్న అధికారులు
- అక్రమ దందాను అడ్డుకోవాలని రైతుల వేడుకోలు

మద్దూరు(ధూళిమిట్ట)/నంగునూరు, జూన్30: సిద్ది పేట జిల్లాలోని ధూళిమిట్ట, నంగునూరు మండలాల్లో కొన్ని రోజులుగా ఇసుక అక్రమ దందా మూడు 'పూలు..ఆరు కాయలు' అన్న చందంగా సాగుతోంది. ఇసుక అక్రమ దందాను అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి, నంగునూరు మండల కేంద్రంతో పాటు ఖాతా, అక్కెనపల్లి, ఘణపూర్ గ్రామాల్లోని మోయతుమ్మెద వాగు నుంచి పెద్ద ఎత్తున కొంత మంది ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వాగు నుంచి అడ్డదిడ్డంగా ఇసుకను తోడేస్తుండడంతో వట్టిపోతోంది. మోయతుమ్మెదవాగు నుంచి రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోజూ వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారు. వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. జాలపల్లిలో సుమారు 15 నుంచి 20, నంగునూరులో 70 నుంచి 100, ఖాతా నుంచి 30 ట్రాక్టర్ల ద్వారా సిద్దిపేట, చేర్యాల పట్టణాలతో పాటు వివిధ గ్రామాలకు ఇసుకను రవాణా చేసి ట్రాక్టర్ యజమానులు లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు రూ. 6 వేల నుంచి రూ. 10వేల వరకు సంపాదిస్తున్నారు. ఆయా గ్రామాల్లో కొంతమంది ఇసుక మాఫియాగా ఏర్పడి దందాను కొనసాగిస్తున్నారు. ఇసుక దందాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ఇసుక మాఫియా బెదిరింపులకు పాల్పడుతోంది. గతంలో ఇసుక దందాను అడ్డుకునేందుకు వెళ్లిన కొంతమంది పోలీసు అధికారులపైకి దాడికి యత్నించారు.

**వందల సంఖ్యలో ఇసుక డంపులు**

మోయతుమ్మెద వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తవ్వి కొంతమంది పెద్ద ఎత్తున ఇసుకను డంపు చేస్తున్నారు. వర్షాకాలంలో వాగు నుంచి ఇసుకను తరలించే పరిస్థితులు ఉండవు కాబట్టి ట్రాక్టర్ యజమానులు గ్రామాల్లో ముందు చూపుతో ఇసుకను వివిధ చోట్ల డంప్ చేస్తున్నారు. కొంతమంది వ్యవసాయ బావుల వద్ద డంపు చేస్తే మరికొంతమంది తమ ఇండ్ల వద్ద ఇసుకను డంపుచేస్తున్నారు. ఇటీవల కాలంలో నంగునూరు, జాలపల్లి గ్రామాల్లో డంపుచేసిన ఇసుకను పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకకు రెవెన్యూ అధికారులు సైతం వేలం పాట నిర్వహించారు. సీజ్ చేసిన ఇసుక డంపులను వేలంలో దక్కించుకున్న వారు ఇదే అదునుగా భావించి, అనుమతుల పేరిట ఇసుకదందాను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**అక్రమ దందాకు అధికారుల అండదండలు**

నంగునూరు, జాలపల్లి, ఖాతా గ్రామాల్లో ఇసుక దందా కొనసాగడానికి కొంతమంది అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక మాఫియా అధికారులకు అమ్యామ్యాలు ఆశ చూపి వారి దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. అప్పుడప్పుడు అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొని చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు సహకరిస్తున్నారనే విషయం కూడా నిఘా వర్గాల ద్వారా ఉన్నతాధికారులకు వెళ్లినట్లు సమాచారం. సదరు అధికారులను కూడా ఉన్నతాధికారులు మందలించారు. వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలించడంతో భూగర్భజలాలు తగ్గడమే కాకుండా వాగు సమీపంలో ఉన్న వ్యవసాయపొలాలు కోతకు గురవుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు వందలసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాగు సమీపంలోని కర్షకులు వాపోతున్నారు. అధికారుల అండదండలకు తోడు అధికార పార్టీ నాయకులు కూడా ఇసుక అక్రమ దందాకు సహకరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ధూళిమిట్ట, నంగునూరు మండలాల్లో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, లేకపోతే ఈ ప్రాంత రైతులకు వరప్రదాయినిగా పిలువబడే మోయతుమ్మెద వాగు వట్టిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





నంగునూరులో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులు, ట్రాక్టర్‌లో తీసుకువెళ్తున్న ఇసుక

# 'మల్లన్న' భక్తులపై దాడి

- ముగ్గురికి గాయాలు, తలపగిలిన మరో యువకుడు
- దాడికి పాల్పడ్డ యువకుల వద్ద గంజాయి ప్యాకెట్ లభ్యం?
- మత్తులో దాడులకు దిగుతున్న ఆకతాయిలు



దాడికి పాల్పడ్డ యువకుల వద్ద లభించిన గంజాయి ప్యాకెట్







కొమురవెల్లిలో గ్యాంగ్ దాడి చేయడంతో గాయపడ్డ భక్తుడు,దాడికి ఉపయోగించిన రాడ్, బైక్‌షాక్ అబ్జర్వర్

చేర్యాల, జూన్ 30 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో శనివారం అర్ధరాత్రి స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులపై అదే గ్రామానికి చెందిన గ్యాంగ్ దాడి చేసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారిని దర్శించుకునేందుకు హైదరాబాద్ నగరంలోని సూరారం, బాలాజీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన జాగరి కరుణాకర్, కౌలం సాయివెంకట్, జశ్విన్‌తో పాటు మరో ఆరుగురు స్నేహితులు వాహనంలో కొమురవెల్లికి వచ్చారు. వరల్డ్ కప్ ఫైనల్స్‌లో ఇండియా విజయం సాధించడంతో మొబైల్ ఫోన్‌లో చూసిన హైదరాబాద్‌కు చెందిన యువకులు కేరింతలు కొడుతూ సంతోషంతో వారు బస చేసే గదుల వైపు వెళ్తుతున్నారు. ఇదే సమయంలో కొమురవెల్లికి చెందిన 8 మంది యువకులు బైక్‌లపై హైదరాబాద్ భక్తులు వెళ్తున్న మార్గంలో ఎదురెదురయ్యారు.వరల్డ్‌కప్ గెలిచిన సంబురంలో కేరింతలు కొడుతున్న యువకులను చూసి తమను చూసే కేరింతలు కొడుతున్నారంటూ బైక్‌లపై వచ్చిన యువకులు ఎలాంటి కారణం లేకుండా విచక్షణారహితంగా రాడ్స్, బైక్‌లకు ఉండే షాక్ అబ్జర్వర్‌తో దాడికి దిగారు.ఈ ఘటనలో కరుణాకర్‌కు తీవ్ర గాయం కావడంతో పాటు మరో ముగ్గురు యువకులు స్వల్పంగా గాయపడ్డారు.వీరితో పాటు వచ్చిన ఆరుగురు హైదరాబాద్ యువకులు ఘటనా స్థలం నుంచి పారిపోయారు. భక్తులపై దాడికి పాల్పడ్డ ఘటన తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలానికి వెళ్లి వారిని అక్కడ నుంచి పంపించేందుకు యత్నిస్తున్న సమయంలో పోలీసులు చేరుకున్నారు. దాడి చేసిన గ్యాంగ్‌కు చెందిన ఓ యువకుడిని పోలీసులు పట్టుకోగా మిగిలిన యువకులు పారిపోయారు. ఘటన ప్రదేశంలో దాడికి పాల్పడిన యువకుల వద్ద గంజాయి ప్యాకెట్లు లభించాయి. యువకులు మద్యం, గంజాయి సేవించి మత్తులో మల్లన్న భక్తులపై దాడికి పాల్పడినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఇదే గ్యాంగ్ సభ్యులు గ్రామంలో జరిగే వారంతపు సంత వద్ద బైఠాయించి వచ్చిపోయే మహిళలు, అమ్మాయిలు, విద్యార్థులను టీజ్ చేస్తున్నారని, మల్లన్న క్షేత్రంలోని ప్రధాన రహదారిలో అతివేగంగా బైక్‌లు డ్రైవ్ చేస్తున్నారని, కొంచం మెల్లగా పోవాలని అంటే నీకు బైక్ తగిలిందా, తగిలితే చెప్పు చూస్తా అంటూ వారిపై తమ ప్రతాపం చూపిస్తున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతున్నది. సంబంధితశాఖ అధికారులు తగు విచారణ జరిపి తమపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గాయపడ్డ యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై చేర్యాల సీఐ శ్రీను విలేకరులతో మాట్లాడుతూ 8 మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యువకుల వద్ద తంబాకు ప్యాకెట్ లభించిందన్నారు.మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా 307 సెక్షన్‌పైన కేసులు నమోదు చేశామన్నారు. ఇక నుంచి కొమురవెల్లిలో యువకుల సంచారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఏడుపాయల్లో భక్తజన జాతర

## పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు



క్యూలో భక్తుల సందడి



పూజాలు అందుకుంటున్న వనదుర్గామాత

పాపన్నపేట, జూన్ 30 : మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గాభవానీ మాతను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరానదిలోని పాయల్లో పుణ్యస్నానాలు చేసి దుర్గామాతను దర్శించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు ,తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ వినోద్ రెడ్డి, ఏడుపాయల చైర్మన్ సతెల్లి బాలాగౌడ్, రవి వీర్ కుమార్, సూర్యశ్రీనివాస్ ,మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహులు, వరుణాచారి, రాజు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ పూజలు నిర్వహించగా పాపన్నపేట్ ఎస్సై నరేశ్ బందోబస్తు చేపట్టారు.

# మల్లన్న దర్శనం.. భక్తుల పరవశం



గంగరేగుచెట్టు ఆవరణలో వేచి ఉన్న భక్తులు

చేర్యాల, జూన్ 30 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మల్లన్న స్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో క్షేత్రం మార్మోగింది. ఆదివారం 10వేల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ ఈవో బాలాజీ శర్మ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో మల్లన్న ఆలయ ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.



రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

## మన సంస్కృతికి నిలయాలు..

# సరస్వతీ శిశుమందిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

- మతం ముద్రవేసి శిశుమందిరాలను నిర్లక్ష్యం చేసిన పాలకులు
- మిషనరీలు, మదర్సాలకు పెద్ద మొత్తంలో నిధులు, వేతనాలు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హుస్నాబాద్, జూన్ 30: దేశంలో నడుస్తున్న వందలాది సరస్వతీ శిశుమందిరాలు సంస్కార కేంద్రాలుగా భాసిల్లుతున్నాయని, వీటిల్లో చదివిన విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, దేశభక్తి అలవడుతున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ సరస్వతీ శిశుమందిర్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశభక్తులను తయారు చేయడంతో పాటు హిందుత్వ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్న సరస్వతీ శిశుమందిరాలపై మతం ముద్ర వేసిన పాలకులు ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వడం లేదన్నారు. దేశద్రోహులకు నిలయాలుగా ఉండి, హిందుత్వ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని నాశనం చేయాలనే దురుద్దేశంతో నడిపిస్తున్న క్రిస్టియన్ మిషనరీలు, మదర్సాల నిర్మాణానికి మాత్రం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, అందులో పనిచేసే వారికి వేతనాలు ఇస్తున్నారంటే హిందుత్వం మీదు ఎంతటి దాడులు జరుగుతున్నాయో తెలుస్తోందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శిశుమందిరాలు ఆంగ్లమాధ్యమంలో బోధన చేస్తున్నప్పటికీ విద్యార్థులకు సంస్కారం నేర్పడం మాత్రం కొనసాగుతోందన్నారు. మమ్మీ డాడీ, ఆంటీ అంకుల్ కల్చర్ లేకుండా అమ్మా నాన్న సంస్కృతి కొనసాగాలన్నారు. సరస్వతీ శిశుమందిర్ విద్యార్థిగా గర్విస్తున్నానని, అందులో నేర్పిన సంస్కారం, క్రమశిక్షణే తనను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని చేసిందన్నారు. పాలకులందరూ కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాయడం వల్లనే సాధారణ పాఠశాలలు మూతపడుతున్నాయని, శిశుమందిరాలు లేకుండా దేశంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థినీ విద్యార్థులు చేసిన నృత్యాలు, పాడిన పాటలు అలరింపజేశాయి. అనంతరం పాఠశాల 40 ఏండ్ల ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యాపీఠం దక్షిణ మధ్య క్షేత్ర ప్రాంత కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, నాయకులు, విద్యాపీఠం ప్రతినిధులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, కొత్తపల్లి అశోక్, చిట్టి గోపాల్‌రెడ్డి, గట్టు రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపీ ఎన్నికల ఖర్చుల రికార్డులను పరిశీలిస్తున్న సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

# ఎంపీ ఎన్నికల వ్యయ పరిశీలన

## ఖర్చుల రికార్డులను పరిశీలించిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 30: పార్లమెంట్ ఎన్నికలు–2024కి సంబంధించిన అభ్యర్థుల ఖర్చుల రికార్డులను సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. గత నెలలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పోటీల్లో పాల్గొన్న అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిశీలన కార్యక్రమాన్ని ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధి ఎన్నికల పరిశీలకుడు మోతీలాల్ షీటే, జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి అభ్యర్థుల ఎన్నికలకు సంబంధించిన ఖర్చుల రికార్డులను పరిశీలించారు. ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించేందుకు అభ్యర్థులు, అభ్యర్థుల తరపున ప్రతినిధులు, ఏజెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడిన 30 రోజుల్లో అభ్యర్థుల ఖర్చు వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించాలని గుర్తు చేశారు. ఖర్చులు సమర్పించని అభ్యర్థుల వివరాలు ఎన్నికల సంఘానికి తెలియజేస్తున్నారు. అభ్యర్థుల వ్యయ రికార్డులు, ఎన్నికల షాడో బృందాలు నమోదు చేసిన రికార్డు మ్యాచ్ కావాలని, మ్యాచ్ కాకుంటే నోటీసులు జారీ చేస్తామన్నారు. ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించని అభ్యర్థులను వచ్చే ఎన్నికల్లో అనర్హులుగా ప్రకటించే అధికారం ఎన్నికల సంఘానికి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీవో బాలశౌరి, వ్యయ పరిశీలన నోడల్ అధికారి అంజ య్య, అధికారులు పాల్గొన్నారు.



హాజరైన వివిధ పార్టీల ప్రతినిధులు

# పాడి రైతులు పరేషాన్



సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూర్‌లోని విజయ పాలకేంద్రం

- రెండు నెలలుగా అందని బిల్లులు
- ఆందోళనలో సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని రైతులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 30: గ్రామాల్లో వ్యవసాయ రంగానికి అనుబంధంగా పాడి పరిశ్రమ మీద ఆధారపడి ఎంతోమంది రైతులు తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. పాలకేంద్రాల్లో రోజూ పాలు పోసి నెల నెలా బిల్లులు తీసుకొని ఉపాధి పొందుతున్న పాడి రైతులకు రెండు నెలలుగా బిల్లులు అందక ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు వానకాలం సాగు పనులు ముమ్మరం అవుతున్న వేళ ప్రభుత్వం రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని అందించకపోగా 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు' రైతులకు రావాల్సిన పాల బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని లద్నూర్ విజయ పాలకేంద్రంలోనే సుమారు 200 మంది పాడి రైతులు రోజూ వెయ్యి నుంచి 12వందల లీటర్ల పాలు పోస్తున్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా సుమారు రూ. 8లక్షలు చెల్లించాల్సి ఉంది. అయితే రెండు నెలలుగా పాల బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదు. రైతు ప్రభుత్వమని చెప్పుకొని గద్దెనెక్కిన రేవంత్ సర్కారు రైతులను నిర్లక్ష్యం చేస్తుందనే దానికి పాల బిల్లులు చెల్లించకపోవడమే నిదర్శనమని పాడిరైతులు విమర్శించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సహాయం దేవుడెరుగు తమకు రావాల్సిన బిల్లులు చెల్లిస్తే చాలని లద్నూర్ పాలకేంద్రం చైర్మన్ రాపాక బుచ్చిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.


